# ఆంధ్రుల జాడ్యం

ఆంధ్రులకు తమను నిందించుకోవటం, ఇతరులను పొగడటం అనే నూతన జాడ్యం ఒకటి అంకురించింది. ఆవడ దగ్గరనుంచీ ఏ అరవవాడో చెయ్యాలి, మనం తినాలి అనే స్థితిలోకి దిగింది మన సంగతి. ఈదారి పరకాయప్రవేశానికి తీసుకొనిపోతుంది అని ఎవ్వరైనా గొణిగితే, రాష్ట్రాభిమానం 'మతాభిమానం' అని అంతర్జాతీయ మొహాలు వేస్తున్నాం. అంతర్జాతీయతను—దుర్బలత్వాన్నీ, సోమరితనాన్నీ నిస్సహాయతనూ కప్పిపుచ్చే ముసుగుగా వాడుకొంటున్నాం.

మనలో ఫలానివాడు ఎవర్నయినా విమర్శిస్తే, వెంటనే ఒక మూలనుంచి ఒక పెద్దమనిషి లేచి, "ఎంతపని చేశాడు! ఎంత ఘోరం చేశాడు!" అని ముక్కుమీద వేలు వేసుకోవటమో, వీడి విమర్శలను ఖండ ఖండాలుగా చేస్తానని కలం తీసుకోవటమో చేస్తాడు. ఒక ప్రక్క ఫలాని వాణ్ణి యీ విధంగా విమర్శిస్తూనే మరొకప్రక్క ఆ ఫలాని వాడు ఎవ్వర్నో విమర్శించినందుకు కారాలు-లేకపోతే మిరియాలు-నూరతాడు. అతన్ని విమర్శించటానికి తనకెంత హక్కువుందో, ఇతరులను విమర్శించటానికి అతడికీ అంత హక్కు వుందని ఆలోచించడు.

ప్రతి ఆంధ్రుడూ యీ పని చేస్తూనే ఉంటాడు. ఒకడు కలంతో విమర్శిస్తే, ఒకడు నోటితో విమర్శిస్తాడు.

ఒకడు కరము మంచిగా విమర్శిస్తే, ఒకడు 'బేవారసు'గా విమర్శిస్తాడు. ఒకడు దేశ శ్రేయస్సుకు విమర్శిస్తే, ఒకడు ఉదరప్రక్షాళనకు విమర్శిస్తాడు. ఇక్కడ గుణం ప్రధానం గనక—రసం కాదు—ప్రతి ఆంధ్రుడూ యీ పని యేదో ఒక విధంగా చేస్తూనే ఉంటాడు.

ఈ విమర్శక గుణం ఆంధ్రులకు పట్టుబడటానికి కారణ మేమిటి? ఇతర దేశాల్లో యింతగా లేని యీ మర్యాద మనకు ఏ ఊదరవల్ల వచ్చింది?

ఆంధ్రుల్లో ఉద్రేకం, ఓర్వలేనితనం ఎక్కువని కొందరంటారు. అందువల్లనే బహు నాయకత్వంతో ఏదో మోసి పోతుందని గోలపెడతారు. పైకి వెళ్ళేవాణ్ణి కిందకు గుంజే ఆచారమేగాని, చేతికి అందినవరకు ఊతం యివ్వరని విచార పడతారు. ప్రతి ఆంధ్రుడూ ఇలాగే మాట్లాడుతాడు. ఇక యీ గుంజేవాడెవ్వడో? 'Man in the Street' కాబోలు!

ఇంతకూ మనలో వున్న దుర్గుణం ఏమిటి? ఆ దుర్గుణానికి దోహదమిస్తోన్న పరిస్థితులు ఏవి? అని యెవ్వరూ ఆలోచించడంలేదు. ఎవ్వరికి వాళ్లు వేదకాలంనాటి ముత్తయిదులమేననీ, ఎవ్వడో ఒకడు ఇదంతా చేసి మనదేశాన్ని మురికిగుంటలోకి లాగుతున్నాడనీ—అన్నట్లు నటిస్తున్నాం.

ఈ పై లక్షణాలన్నిటికీ విమర్శకజ్ఞానమే మూల కారణమనుకుంటాను. మనకీ లక్షణం ఏ గాలికి వచ్చింది?

మన దేశంలో బలమైన మధ్యతరగతి ఉండటమే దీనికి కారణం. ఈ మధ్యతరగతి ఉండటంవల్ల మేధశ్శక్తిలో కూడా క్రమేణా సమానత్వం కొంతవరకు ఏర్పడుతుంది.

దీనివల్ల విమర్శక జ్ఞానం అలవడుతుంది. విమర్శించటానికి దుర్బలులనూ, అనారోగ్యులనూ, ఈర్ష్య ప్రేరేపిస్తే శక్తిమంతులను సంఘశ్రేయస్సు ప్రేరేపిస్తుంది.

ఒక సంఘానికిగానీ, ఒక దేశానికిగానీ, విమర్శ లేకపోతే జీవమే లేనట్లు. అటువంటి గుణం మనకున్నప్పుడు సిగ్గుపడటం ఎందుకు ? విచారపడటం యెందుకు ? "ఆశక్తిని దుర్వినియోగం చేస్తున్నాం; మన తెలివితేటలు తప్పుదారిని పడుతున్నాయి" అంటారా ? అయితే మంచి దారిలోకి తిప్పటానికి ప్రయత్నించాలిగాని హేళనలతో, చీవాట్లతో, విసుగుదలతో, ఆ గుణాన్ని చంపటానికి ప్రయత్నించకూడదు.

బహు నాయకత్వం ఉండటంవల్ల మన దేశానికి తీరని నష్టం ఏమీ లేదు. ఉన్నా మధ్యతరగతి మన దేశంలో ఉన్నంతకాలం—ఇది ఇప్పట్లో పోదు * తప్పనిసరి అవుతుంది. ఈ విషయాన్ని రగడలోకి దింపి, నేరాన్ని ఎవ్వరి మీదో మోపి, పెదవి విరుపులతో కాలం వృథాపుచ్చేదానికన్నా, "ఆత్మ" పరీక్ష చేసుకొని, మన కౌశలాన్ని సక్రమ మార్గాలలో పెట్టుకోటానికి, మన దృష్టిని దోషభూయిష్ఠం చేసుకోకుండా ఉండటానికి, ప్రయత్నించటం శరీరానికీ, దేశానికీ మంచిది.

---

* ఆంధ్ర దేశంలో రైతువారీ పద్ధతి ఆచరణలో వుండటంవల్ల మధ్యతరగతి ఏర్పడింది. ప్రజాస్వామిక విప్లవం జరిగితేగాని, ఈ కేపిటలిజం వృద్ధిచెందితేగాని యీ తరగతి పోదు. ఈ విషయం మనల్ని మనం విమర్శించుకునే ముందు జ్ఞాపకం ఉంచుకోవాలి.